# భలే అమ్మాయి!

నేనూ మావారూ - ఆఫీసుకని బయలుదేరుతున్నాం. 'ఒక్క నిమిషం మేడమ్' అన్న గొంతు విని తిరిగి చూశాను. పద్దెనిమిదీ ఇరవై ఏళ్ల అమ్మాయి, గులాబీరంగు నైలాను చీరా, ఒదులుగా వేసుకున్న పొడుగాటి జడ, కోలబొట్టు, గుండ్రటి మొహమూ, ఛామన ఛాయలో వున్నా, కళగా వున్న మొహంతో చూడగానే ఆగాలనిపించి ఆగాను.

చేతిలోని సంచీలోంచి రెండు ఫినైలు సీసాలూ, సబ్బుపొడి ప్యాకెట్లూ తీసి, 'మేడమ్! ఈ సబ్బు, ఫినైలూ కొత్తగా వొచ్చాయి మార్కెట్టులోకి. ఒక్కొక్కటి పదిరూపాయలు మాత్రమే. ఈ నాలుగూ కొంటే, ఈ సబ్బు బిళ్ల 'ఫ్రీ' అంటూ చూపించింది.

మావారు విసుక్కుంటూ 'పద పద టైమయిపోయింది' అన్నారు. ఆయన తొందర పడడం చూసి ఆ అమ్మాయి 'మేడమ్ ప్లీజ్' అంది. ఆ అమ్మాయి జాలిగా చూడ్డం చూస్తే నాకు 'ఒద్దు' అని అనాలనిపించలేదు. నలభై రూపాయలూ ఇచ్చి నాలుగు ప్యాకెట్లూ తీసుకున్నాను. సంతోషంతో "థ్యాంక్యు మేడమ్" అంటూ వెళ్లిపోయింది. మావారు నాకేసి కోపంగా చూశారు. 'ఎందుకివి అనవసరంగా' అంటూ. 'ఏదో పోనీలెండి, పనికొచ్చే ఐటమ్సేగా' అన్నాను.

ఆ తరువాత ఒకరోజున మళ్లీ వొచ్చింది. అప్పుడు మా వారింట్లో లేరు. తీరిగ్గా కూర్చున్న నేను ఆ అమ్మాయితో బాతాఖానీ మొదలెట్టాను. "ఇలా ఇల్లిల్లూ తిరిగి అమ్మితే ఎంతిస్తారూ?" అని. "ప్యాకెట్టుకి ఒక రూపాయి. ఒక ఫినైలు సీసాకీ ఒక రూపాయి కమీషను. అలా రోజుకి ఎన్ని అమ్మితే అన్ని రూపాయలు. జీతం మటుకు నెలకి రెండొందలు. ఈ కమీషన్లు నెలకి దాదాపు ఇంకో రెండొందలొస్తాయి" అంది. "ఇంతేనా? అన్నాను జాలిగా. ఆ అమ్మాయి వలవలా ఏడ్చేసింది. "ఎందుకేడుస్తున్నావ్" అన్నాను కంగారుగా! "ఈ ఒక్క సంపాదన మీదే పదిమందిమి బతుకుతున్నాం. మా నాన్నగారు మా పదిమంది భారం అమ్మకొదిలేసి, మరో పెళ్లి చేసుకున్నారు. మా దగ్గరకి రారు. అక్కడే

వుంటారు. మా అన్నయ్య చదువు మానేశాడు. పనిచెయ్యడు." అంది ఏడుస్తూ.

నా హృదయం కరిగిపోయింది. "ఛీ! ఈ మగాళ్ళింతే! గంపెడు పిల్లల్ని కని, గాలికొదిలేసి, మరో పెళ్లి చేసుకుని కులుకుతున్నాడు" అంటూ పైకే తిట్టేశాను. ఆ అమ్మాయికి కాఫీ, టిఫినూ ఇచ్చి కూర్చోబెట్టి, కాస్సేపు మాట్లాడి మరో నాలుగు ప్యాకెట్లు సబ్బు పొడి, రెండు సీసాలు ఫినైలూ అక్కర్లేకపోయినా కొని పంపించేశాను. అలా ఆ అమ్మాయి వొచ్చినప్పుడల్లా కొని, నాకు తోచిన సహాయం నేను చేస్తున్నాను కదా అని తృప్తి పడుతూ వచ్చాను.

ఒకరోజు రాత్రి తొమ్మిది గంటలు కావొస్తోంది. వాన హోరున కురుస్తోంది. ఆ వానలో ఆ చీకట్లో, కాల్ బెల్ విని తలుపు తీశాను. తడిసి ముద్దయి ఆ అమ్మాయి. ఆశ్చర్యపోయాను. నన్ను చూసి ఘొల్లుమని ఏడ్చింది.

ముందు తల తుడుచుకోవడానికో తువ్వాలిచ్చి, నాదో మోస్తరు పాత చీరా, బ్లౌజూ అన్నీ ఇచ్చి మార్చుకోమని చెప్పి, విషయమేమిటని అడిగాను.

"మా చిన్న తమ్ముడికి సడన్‌గా ఫిట్సొస్తూ వుంటే కోరంటి ఆసుపత్రిలో చేర్పించాం. మందులకీ ఇంజక్షన్లకీ, వాళ్లు రాసిచ్చినవి కొని తేవాలంటే వంద రూపాయలు కావాలి. నా దగ్గర డబ్బులేదు. మా 'బాస్ ఊర్లో లేరు. ఇవి కొనకపోతే మా తమ్ముడు బతకడు మేడమ్. మాబాస్ రాగానే ఇచ్చేస్తాను. వంద అప్పివ్వండి" వెక్కి వెక్కి ఏడ్చింది. నా మనస్సు ద్రవించిపోయింది. శ్రీవారితో చెప్పాను.

"బాగానే టోపీ పెడుతోందిలే! లేవని చెప్పు" అన్నారు. టోపీ పెట్టడానికి ఈ అర్థరాత్రి ఈ జడివానలో తడుస్తూరావాలా?" అన్నాను. "లేకపోతే నువ్వు డబ్బివ్వవుగా" అన్నారు. "అన్నీ అనుమానాలే మీకు" అన్నాను కోపంగా. ఇక లాభంలేదని చెప్పి వందరూపాయలూ తీసిచ్చారాయన. ఆ అమ్మాయికిచ్చాను. తొందరగా మందులు కొని తీసికెళ్లమని చెబుతూ.

కృతజ్ఞతతో నాకేసి చూసి నమస్కారం పెట్టింది రెండు చేతులూ జోడించి. తృప్తిగా నిట్టూర్చాను. "భలే అమ్మాయిలే. నిన్నే బోల్తాకొట్టించింది!" అన్నారు శ్రీవారు నవ్వుతూ.

వారాలూ, నెలలూ దాటిపోయాయి. మళ్లీ ఆ అమ్మాయి కనిపించలేదు. మధ్యలో ఎన్నిసార్లో తలుచుకున్నాను. మావారు పరవాలేదులే గోవిందా గోవిందా! అనుకో" అన్నారు. కానీ ఆ పిల్ల ఒస్తుందనే నమ్మకం నాలో పోలేదు.

ఒకరోజున మేమంతా సినిమాకెళ్లాం. ఆ హాల్లో మా ముందు సీటులో కూర్చుని పకపకా నవ్వులూ, గుసగుసలూ చూసి, 'ఎవరా ఈ గొడవా?' అని పరిశీలనగా చూశాను. ఆ అమ్మాయి నాకేసి చూసింది. ఎక్కడో చూసిన మొహంలా అనిపించింది. గుర్తు తెచ్చుకుని అడగబోయేసరికి సినిమా మొదలయింది. ఇంటర్వెల్ లో అడుగుదామనుకున్నాను. అంతలోకే ఆ అమ్మాయి మెరుపులా మాయమైపోయింది. ఖాళీ కుర్చీలు నన్ను వెక్కిరించాయి. *